సాక్షి
నంద్యాల

ఆదివారం । 8 । జూన్ । 2025



నీటి కుంటలో పడి బాలిక మృతి

ప్రమాదవశాత్తూ నీటి కుంటలో పడి ఓ బాలిక మృతి చెందింది. ఈ దుర్ఘటన దొల్తాపురం గ్రామంలో చోటుచేసుకుంది. 10లో▸



తహసీల్దార్ల బదిలీలు

నంద్యాల జిల్లాలో 8 మంది తహసీల్దార్లను, అలాగే 8 మంది డిప్యూటీ తహసీల్దార్లను శనివారం బదిలీ చేశారు. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,601.53
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 23.398
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,883
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 253

న్యూస్‌రీల్

శ్రీగిరి.. భక్తజన ఝరి!



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో శనివారం భక్తుల రద్దీ కనిపించింది. మల్లన్న దర్శనానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు కిక్కిరిసి కనిపించాయి. పలువురు భక్తులు స్పర్శ దర్శనం టికెట్లు పొంది మూడు విడతలుగా స్వామివారి స్పర్శదర్శనం నిర్వహించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగాణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు శనివారం హైదరాబాద్‌కు చెందిన పి.వెంకటరఘురామరాయలు రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు గంజి రవికి అందజేశారు. విరాళాన్ని అందించిన దాతను దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

మహానందిలో భక్తుల సందడి



చిన్నకోనేరులో భక్తుల పుణ్య స్నానాలు

మహానంది: ప్రముఖ క్షేత్రమైన మహానందిలో శనివారం భక్తుల సందడి కనిపించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఉదయం నుంచి ప్రారంభమైన శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి శంకర్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 130 కళాశాలలో 4,842 మంది సప్లిమెంటరీ పరీక్షలు రాయగా అందులో 2,062 మంది పాస్ అయ్యారన్నారు. అదే విధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం 2,892 మంది సప్లిమెంటరీ పరీక్షలు రాయగా 2,005 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఒకేషనల్ 32 కళాశాలల్లో 446 మంది మొదటి సంవత్సరం పరీక్షలు రాయగా 285 మంది , సెకండియర్‌లో 292 మందికి గాను 259 మంది పాస్ అయినట్లు తెలిపారు.

చిచ్చు రేపిన ఫ్లెక్సీలు
చిత్రమైన కలహాలు!

భూమా కుటుంబంలో 'ఫ్లెక్సీల' తంటా!

- దేవర సందర్భంగా ఎమ్మెల్యే అఖిలప్రియ ఫొటో లేకుండా ఫ్లెక్సీ
- జిల్లా నేతల ఫొటోలతో వేయించిన చిన్నాన్న భూమా బ్రహ్మానందరెడ్డి
- బావ మంచు మనోజ్ ఫొటోతో మరో ఫ్లెక్సీ వేయించిన బావమరిది భూమా సంతోష్
- అధికారులను పురమాయించిన ఎమ్మెల్యే
- ప్రయివేట్ కార్యక్రమం కావడంతో చేతులెత్తేసిన వైనం
- తెరపైకి ఇన్‌చార్జి మార్పు వ్యవహారం



పెదబావ భార్గవరామ్ ఫొటో లేకుండా చిన్నబావ మంచు మనోజ్ ఫొటోతో ఫ్లెక్సీ

పెద్దబావ వద్దు.. చిన్నబావే ముద్దు

మొన్నటి దాక అఖిలప్రియ భర్త భార్గవరామ్ ఫొటోలతో ఫ్లెక్సీలు వేయించిన అఖిప్రియ చిన్నాన్న కొడుకు భూమా సంతోష్‌రెడ్డి కూడా తన పంథా మార్చడం చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడూ లేనిది చిన్నక్క భూమా మౌనికారెడ్డి భర్త మంచుమనోజ్ ఫొటోతో ఫ్లెక్సీ వేయించడం భూమా కుటుంబంలో కలకలం రేపుతోంది.

ఆళ్లగడ్డ: నియోజకవర్గ టీడీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. దొర్నిపాడు మండలం గోవిందెన్న పెద్దమ్మ దేవర సందర్భంగా భూమా కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎమ్మెల్యే అఖిలప్రియ ఫొటో మాత్రమే లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ భూమా కుటుంబంలో అగ్గి రాజేసింది. అయితే ఇందులో జిల్లాలోని టీడీపీ ప్రజాప్రతినిధులందరి ఫొటోలు ఉండటం గమనార్హం. పెద్దమ్మ తల్లి దేవర మొత్తం భూమా కుటుంబం ఆధ్వర్యంలోనే జరపడం ఆనవాయితీ. ఈ క్రమంలో జరుగుతున్న దేవర సందర్భంగా ఎమ్మెల్యే అఖలప్రియ చిన్నాన్న, మాజీ ఎంపీపీ భూమా బ్రహ్మానందరెడ్డి ఓ ఫ్లెక్సీ వేయించారు. ఇందులో కూతురు అఖిలప్రియ ఫొటో లేకుండా ఎంపీ బైరెడ్డి శబరి, మంత్రులు ఫరూక్, బిసి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే గౌరుచరితతో పాటు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఎమ్మెల్యే అఖిలకు మింగుడు పడలేదని తెలుస్తోంది. ఈ విషయమై ప్రొటోకాల్ పాటించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అక్కడకు వెళ్లిన పోలీస్, పంచాయతీ అధికారులు అందులో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల ఫొటోలు ఉండటంతో తమకెందుకు వచ్చిన గొడవని మిన్నకుండిపోయారు. అది ప్రయివేట్ ప్రోగ్రాం కావడంతో వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలని ఎమ్మెల్యేకు చెప్పి చేతులెత్తేసినట్లు చర్చ జరుగుతోంది. ఈ విషయమై ఎమ్మెల్యే జిల్లా ఎస్పీ, కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



ఎమ్మెల్యే అఖిలప్రియ ఫొటో లేకుండా వేయించిన ఫ్లెక్సీ

టీడీపీ ఇన్‌చార్జి మార్పు కోసమేననే చర్చ

ఎమ్మెల్యే అఖిలప్రియ, ఆమె భర్త భార్గవరామ్‌పై వరుస ఆరోపణల నేపథ్యంలో టీడీపీ అధిష్టానం సీరియస్ ఉన్నట్లు తెలుస్తోంది. అవసరమైతే నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా వేరొకరిని నియమించాలనే ఆలోచన కూడా ఉన్నట్లు చర్చ జరుగుతోంది. సీపీ శ్రీనివాసరెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నారనే వార్తలు కూడా గుప్పుమంటున్నాయి. ఇదిలాఉంటే మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి.. అఖిలప్రియ చెల్లెలు, మంచు మనోజ్ భార్య భూమా మౌనికారెడ్డిలలో ఎవరో ఒకరికి కూడా ఇన్‌చార్జి పదవి కట్టబెట్టవచ్చని కూడా టీడీపీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

మంత్రి బీసీకి పరిజ్ఞానం ఉందా?

- సమాచారం తెలుసుకోకుండా ఆరోపణలు చేస్తారా?
- మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన



డోన్: కనీస పరిజ్ఞానం లేకుండా రాష్ట్ర రోడ్లు రవాణా శాఖా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తనపై ఆరోపణలు చేయడం ఆశ్చర్యాన్ని కలిగించిందని మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం డోన్ పర్యటనలో భాగంగా రాష్ట్ర మంత్రి బీసీ చేసిన ఆరోపణలను మాజీ మంత్రి బుగ్గన ఖండించారు. 'సాక్షి'తో బుగ్గన ఫోన్‌లో మాట్లాడారు. వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులకు ఆర్థికశాఖ మంత్రులు వ్యక్తిగతంగా ఎలా బాధ్యత వహిస్తారనే విషయం మంత్రికి తెలియదా అని ప్రశ్నించారు. సరైన సమాచారం తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు.

ఏడాదికే రూ. 5లక్షల కోట్ల అప్పు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో లక్షా ముప్పై వేల కోట్లు అప్పులు చేస్తే ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఐదు లక్షల నూటతొంభై రెండు వేల కోట్లు అప్పు ఎందుకు చేసిందో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని బుగ్గన డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేసే అప్పులకు ఆర్థికమంత్రి పయ్యావుల కేశవులు వ్యక్తిగతంగా బాధ్యత వహిస్తే వైఎస్సార్‌సీపీ హయంలో చేసిన అప్పులకు తాను కూడా బాధ్యత వహిస్తానని మాజీ మంత్రి బుగ్గన అన్నారు. అప్పుల విషయంపై మంత్రి బీసీ తనను డిబేట్‌కు రావాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. అసెంబ్లీ కంటే పవిత్రమైన వేదిక వేరేది ఉందనుకుంటే ఎక్కడికైనా బీసీతో డిబేట్‌కు రావడానికి తాను సిద్ధమేనని మాజీ మంత్రి బుగ్గన ప్రతిసవాల్ విసిరారు.

ఫ్యాక్టరీని తెరిపిస్తే మూత వేయించినది ఎవరు?

2014కు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో మూత పడిన పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి తెరిపించామని మాజీ మంత్రి బుగ్గన అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే టీడీపీ ప్రభుత్వం సిమెంట్ ఫ్యాక్టరీని మూత పడేటట్టు చేసి వందలాది కార్మికులను రోడ్డున పడేసిన చరిత్ర కూటమి ప్రభుత్వానిదే అన్నారు.

ఏ గ్రామానికి రోడ్డు వేయించారు?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము రోడ్లు వేయిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ.. డోన్ నియోజకవర్గంలో ఏ గ్రామానికి రోడ్డు వేశారో చెప్పాలని మాజీ మంత్రి బుగ్గన సవాల్ విసిరారు. ఇతరులు ఇచ్చిన తప్పుడు సమాచారం మేరకు మాట్లాడటం మంత్ర బీసీకి భావ్యం కాదన్నారు.

అండర్ వాటర్ వీడియోగ్రఫీకి సిద్ధం



సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న ఈతగాళ్లు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం ప్లంజ్‌పూల్‌లో అండర్ వాటర్ వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ సోమవారం ప్రారంభం కానుంది. శనివారం ఉదయం నుంచి ప్లంజ్‌పూల్ నీటిలో పరిశోధన జరిపే పరికరాలను సిద్ధం చేస్తున్నారు. వాల్తేరు నుంచి వచ్చిన గజ ఈతగాళ్లు శ్రీశైలండ్యాం వద్ద పరికర సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ నిపుణులు సోమవారం నుంచి ప్లంజ్‌పూల్‌లో ఏర్పడిన గోతులను, కాంక్రీట్ సిలండర్ల పటిష్టతను చిత్రీకరిస్తారు. అనంతరం కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్‌కు సమర్పిస్తారు. గత కొద్ది రోజుల క్రితం జరిగిన బ్యాతమెట్రిక్ సర్వే, అండర్ వాటర్ వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ నివేదికల ఆధారంగా ప్లంజ్‌పూల్ పనులు చేపడతారు.

9 నుంచి ఏపీ పీజీసెట్

కర్నూలు కల్చరల్: తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కామన్ పీజీ సెట్ ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఏపీ పీజీ సెట్‌కు 25,688 దరఖాస్తులు రాగా.. వర్సిటీల్లో 426 కోర్సులకు 34,788 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఉన్న సీట్ల కంటే 9,090 దరఖాస్తులు తక్కువ రావడం గమనార్హం. కర్నూలు జిల్లాలో ఉన్న మూడు యూనివర్సిటీల్లో 35 కోర్సులకు 2,017 సీట్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో పీజీ ప్రవేశ పరీక్ష రాస్తున్న వారి సంఖ్య 1,769 మంది మాత్రమే. అంటే దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 30 కేంద్రాల్లో మూడు సెషన్‌లలో పరీక్షలు నిర్వహించనున్నారు. కర్నూలులో నగరంలో జి.పుల్లా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, దూపాడు ఐయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్షలు జరగనున్నాయి. మొదటి సెషన్ ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, మూడో సెషన్ సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పీజీ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

అంతంతమాత్రం తేమలో విత్తనం వేయొద్దు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అంతంతమాత్రం తేమలో విత్తనం విత్తుకోవద్దని ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ తెలిపారు. నల్లరేగడి నేలల్లో 75 మి.మీ వర్షపాతం ఒక్క రోజులో నమోదైనా లేదా వరుసగా మూడు రోజుల్లో నమోదైనప్పుడు మాత్రమే విత్తనం వేసుకోవాలని సూచించారు. ఎర్ర నేలల్లో కనీసం మూడు రోజులు లేదా ఒక్కరోజులో 50 మి.మీ వర్షపాతం నమోదైతేనే విత్తనం వేసుకోవాలన్నారు. అంతంతమాత్రం తేమలో విత్తనం వేసుకుంటే మొలక సరిగా రాద ని పేర్కొన్నారు. ప్రస్తుతం పచ్చిరొట్ట ఎరువులు వేసుకునేందుకు ఇది చక్కటి అదును అన్నారు. వరిలో జనుము, జీలుగ, పిల్లి పెసర వేసుకోవచ్చని, మెట్ట పంటల్లో పిల్లిపెసర వేసుకోవచ్చని వివరించారు. కాగా శనివారం మధ్యాహ్నం నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



యోగా ఆసనం వేస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ, అధికారులు

మహానంది: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంతతను పొందవచ్చని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. మహానంది ఆలయ ప్రాంగణంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు అందరూ యోగాసనాలు వేశారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన శ్రీశైలం, మహానంది, అహోబిలం, బెలుం గుహలు, పచ్చర్ల జంగిల్ క్యాంప్‌లో యోగా కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జేసీ విష్ణుచరణ్, ఆర్‌డీఓ విశ్వనాథ్, డీఎంహెచ్ఓ వెంకటరమణ, ఆయుష్ వైద్యాధికారి యశోధర, మహానంది ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు చెందూరి రవిశంకర అవధాని తదితరులు పాల్గొన్నారు.

చాలా కష్టం 'గురు'



పదోన్నతుల కౌన్సెలింగ్ కోసం శనివారం అర్ధరాత్రి వేచి చూస్తున్న ఉపాధ్యాయులు

- ప్రహసనంగా పదోన్నతుల ప్రక్రియ
- కూటమి ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయుల ఆగ్రహం

కర్నూలు సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపడుతున్న ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెకండ్ గ్రేడ్ టీచర్లకు ప్రాథమిక పాఠశాల(మోడల్ ప్రైమరీ స్కూల్) ప్రధానోపాధ్యాయులుగా (స్కూల్ అసిస్టెంట్‌తో సమానం)పదోన్నతులు కల్పించేందుకు సీనియారిటీ జాబితాలు తయారు చేశారు. ఈ జాబితాలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన టీచర్ల సీనియారిటీ జాబితాలో ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ ప్రకారం అర్హులను గుర్తించడంలో జాప్యం జరుగుతోంది. ఈ కారణంగానే ఒకే రోజు ముగియాల్సిన పదోన్నతుల కౌన్సెలింగ్ రెండు రోజులుగా ఉదయం 8 గంటల నుంచి తెల్లవారుజాముదాకా సాగుతోంది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

2023లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి జిల్లాల్లో ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్స్‌గా సుమారుగా 2 వేల మందికి పదోన్నతులు కల్పించింది. ఎక్కడ కూడా చిన్న వివాదం లేకుండా పదోన్నతులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

ప్రస్తుతం ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 639 ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పోస్టులు, 140 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 754 మైడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు కానున్నాయి. ఇందులో 639 స్కూళ్లకు మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పోస్టులను సెకెండ్ గ్రేడ్ టీచర్లకు పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తున్నారు. ఇందుకు మొదటగా సీనియారిటీ జాబితాను 2 వేల మంది టీచర్లతో తయారు చేశారు. ఆ తరువాత 1500 మందికి కుదించారు. సీనియారిటీ జాబితాలో సీరియల్ నంబరు 1000 తరువాత ఉన్న టీచర్లు అత్యధిక శాతం మంది పీఎస్‌హెచ్ఎంలుగా వెళ్లేందుకు ఆసక్తి చూపకపోవడంతోనే కౌన్సిలింగ్ జాప్యం జరుగుతోంది.



పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

తెల్లవారుజాము వరకు..

పదోన్నతుల కౌన్సెలింగ్ శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు మొదలై శనివారం 6.30 గంటల వరకు జరిగింది. ఆ తరువాత ఉదయం 8 గంటలకు మొదలైనా 9 గంటలకే బంద్ చేశారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు మొదలైనా..మందకొడిగా సాగుతుండడంతో తెల్లవారుజామున రెండు గంటల వరకు కౌన్సెలింగ్ జరిగే అవకాశం ఉన్నట్లు ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. రెండు రోజులుగా ఉపాధ్యాయులు పగలు, రాత్రి కౌన్సెలింగ్ కేంద్రంలోనే జాగరణ చేయాల్సి వచ్చింది. విద్యాశాఖ తీరుపై ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల నిరసన

పాఠశాల విద్యాశాఖ అధికారులు గత నెలలో ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉపాధ్యాయుల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. కర్నూలులోని ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లోని కౌన్సెలింగ్ కేంద్రం వద్ద శనివారం ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతూ ఆదివారం డీఈఓ కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టామని, ఉపాధ్యాయులందరూ వచ్చి జయప్రదం చేయాలన్నారు.

నంద్యాలలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



త్యాగ నిరతి.. దాతృత్వం వెల్లివిరిసి!

త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పండుగను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలకు తరలి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్వమానవాళి శాంతి కోసం అల్లాహ్‌ను వేడుకున్నారు. అనంతరం ఈద్ ముబారక్ చెప్పుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. మతపెద్దలు బక్రీద్ పండుగ గొప్పతనాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని సూచించారు. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా అందరూ పండుగ చేసుకునే విధంగా ఖుర్బానీ ఇచ్చారు. వేడుకలో సామరస్య స్ఫూర్తి, దాతృత్వం వెల్లివిరిసింది. – నంద్యాల

తాగునీటితో దర్జా 'సాగు'తోంది!

- జీడీపీ ఎడమ కాల్వ తూము తెరిచిన టీడీపీ నేత
- తాగునీటి నిల్వలు సాగుకు మళ్లించిన వైనం

గోనెగండ్ల: 'మమ్మల్ని ఎవరూ ఆపేది'.. అంటూ ఓ టీడీపీ నేత గాజులదిన్నె ప్రాజెక్ట్‌లో తాగునీటి అవసరాలకు నిల్వ ఉంచిన నీటిని దర్జాగా సాగుకు మళ్లించాడు. టీడీపీ నేత ఘన కార్యాన్ని అధికారులు లీకేజీ పేరుతో దాచేస్తుండటం కొసమెరుపు. జీడీపీ కింద సాగునీటికి కేవలం రబీ సీజన్‌లో మాత్రమే విడుదల చేయాల్సి ఉంది. అయితే వర్షాధారం కింద ముందస్తు వేసిన పంటలకు నీరందించేందుకు జీడీపీ నీటిని విడుదల చేయడంపై రైతులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వర్షాలు ఆలస్యమై తాగునీటి సమస్య ఏర్పడితే తమ 'గోడు' ఎవరికి చెప్పుకోవాలని ప్రజలు వాపోతున్నారు. జీడీపీ నుంచి పత్తికొండ, డోన్ తదితర పట్టణాలకు తాగునీటి కోసం విడుదల చేస్తారు. ఓ టీడీపీ నేత శనివారం ఎడమ కాల్వ తూము గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 1.1 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. వర్షాలు కురిసి వరద నీరు జీడీపీలో వచ్చి చేరేంత వరకు ప్రస్తుతం ఉన్న ఈ నీటితోనే తాగునీటి పథకాలకు విడుదల చేయాల్సి ఉంది. నీటి విడుదల అధికారులకు తెలిసే జరిగి ఉంటుందని పలువురు అనుమానిస్తున్నారు. ఈ విషయంపై డీఈ విజయ కుమార్ వివరణ కోరగా.. ప్రాజెక్టు ఎడమ కాలువలో ప్రవహిస్తున్న నీరు లీకేజీ మాత్రమేనని.. లీకేజీలకు అడ్డుకట్ట వేసి నీటి వృథాను అరికడతామన్నారు.



జీడీపీ ఎడమ కాలువలో ప్రవహిస్తున్న నీరు



గాజులదిన్నె ప్రాజెక్టు

క్లుప్తంగా

శ్రీమఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి



కర్ణాటక హైకోర్టు జడ్జికి స్వాగతం పలుకుతున్న మఠం అధికారులు

మంత్రాలయం రూరల్: శ్రీమఠంలో కొలువైన శ్రీరాఘవేంద్ర స్వామిని శనివారం కర్ణాటక హైకోర్టు జడ్జి అశోక్ ఎస్. కినాగి దర్శించుకున్నారు. ఉదయం మంత్రాలయం చేరుకున్న న్యాయమూర్తికి శ్రీమఠం మహాముఖద్వారం వద్ద మఠం అధికారులు శ్రీమఠం ధార్మిక మేనేజర్ శ్రీపతి ఆచార్ స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను కుటుంబ సమేతంగా అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కాసేపు ముచ్చటించారు.

వినికిడి లోపం ప్రాణం తీసింది!

- రైలు పట్టాలు దాటుతుండగా ఢీకొట్టిన గూడ్స్

ఆదోని సెంట్రల్: వినికిడి లోపం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. కోసిగి మండల కేంద్రానికి చెందిన జంపాపురం బసన్న (56) ప్రమాదావశాత్తు శనివారం రైలు కింద పడి మృతి చెందాడు. కోసిగి ఎల్‌సిగేట్ నంబర్.205 అప్‌లైన్ ట్రాక్ దాటుతుండగా వేగంగా వచ్చిన గూడ్స్ రైలు తగిలి తలకు బలమైన రక్తగాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. వినికిడి సమస్య కారణంగా దూరంగా వస్తున్న గూడ్స్ శబ్దం వినిపించక పోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, డీఐజీ కోయ ప్రవీణ్ తదితరులు

డోన్ టౌన్: ప్రజలు ప్రశాంతంగా జీవించేలా శాంతిభద్రతలను పరిరక్షిస్తామని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. డోన్ డీఎస్పీ కార్యాలయంపై నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తు భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు డీఐజీ కోయ ప్రవీణ్, ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. మంత్రి బీసీ ఆర్థిక సహకారంతో పోలీసు పెట్రోలింగ్ కోసం రూ.5.5లక్షలతో కొనుగోలు చేసిన డ్రోన్‌ను వారు ప్రారంభించారు. అనంతరం ఆర్ అండ్‌బీ నూతన అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సమాజంలో ప్రజల జీవనానికి ఆటంకం కల్గించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనంతరం డోన్ పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మారం సుబ్బారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు సీఐలు ఇంతియాజ్‌బాషా, సీఎం రాకేష్, ప్రవీణ్‌కుమార్, మోహన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

WANTED
- General Manager (MBA and min 5 Yrs work experience in retail field)
- Store Manager
- Visual Merchandiser
- Advertisement Incharge
- Account Executives
- Computer Operaters
- Sales Executives
- Security guards
- Drivers
- Helpers (M)

మూల పెద్దమ్మ దేవరకు వేళాయె!

- నేటి నుంచి డబ్ల్యూ గోవిందిన్నెలో దేవర
- 11 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న వైనం

దొర్నిపాడు: జిల్లాలో ఎంతో విశిష్టత ఉన్న డబ్ల్యూ గోవిందిన్నె మూల పెద్దమ్మ దేవర నేటి నుంచి ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవానికి గ్రామం ముస్తాబైంది. బంధువులతో అందరి ఇళ్లు కళకళలాడుతున్నాయి. ప్రతి ఐదేళ్లకు ఒక సారి నిర్వహించే పెద్దమ్మ దేవరను గతంలో కరోనా కారణంగా నిర్వహించలేక పోయారు. 11 ఏళ్ల తర్వాత గ్రామ ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు దేవర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 8వ తేదీ ఆదివారం దేవి ఉత్సవం, 9న సోమవారం అమ్మవారికి గండదీప పూజలు, 10న మంగళవారం ఎల్లమ్మ పూజలు నిర్వహించి దేవరను ముగిస్తారు. గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. గ్రామానికి చెందిన జూదం వంశీకులు తినడానికి తిండిలేక దొంగతనాలు చేస్తూ జీవనం సాగించేవారు. ఇందులో భాగంగా కొన్నేళ్ల క్రితం జూదం వంశీకులు కర్నూలు ప్రాంతంలో ఓ బ్రాహ్మణ ఇంట్లో చొరబడి మేదర పెట్టెను అపహరించారు. ఇంటికి వచ్చి అందులో చూడగా మూల పెద్దమ్మ విగ్రహం ఉండటంతో ఆశ్చర్యపోయారు. వారిలో ఒకరికి అమ్మవారు పూని 'నన్ను ఇక్కడే కొలువుంచండి మీకు సుఖశాంతులు కల్గుతాయి' అని చెప్పడంతో ఆ ఇంట్లోనే పెద్దమ్మను ప్రతిష్ఠించుతారు. దీంతో వారి ఇళ్లే పెద్దమ్మ ఆలయంగా మారిందని స్థానికులు చెబుతారు.



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ



పడమర వాకిటి కల్గిన పెద్దమ్మ ఆలయం

మూల పెద్దమ్మ ఎందుకంటారంటే..

ఎక్కడైనా ఆలయాలు చాలా వరకు తూర్పు ముఖం కల్గి ఉండి విగ్రహాలు వాకిటికి ఎదురుగా ప్రతిష్ఠిస్తారు. ఇక్కడ అలా కాదు. పెద్దమ్మ ఆలయంగా మారిన ఇళ్లు పడమర ముఖం కల్గి ఉంటుంది. జూదం వంశీకులు చోరీ చేసిన పెట్టను మూలకు ఉంచడం, పెద్దమ్మ అక్కడే ఉంచాలని కోరడంతో మూల పెద్దమ్మగా కొలుస్తారు.

మేము ఎంతో అదృష్టవంతులం



అప్పట్లో అమ్మవారికి ముడుపును కట్టిందుకు కర్నాటి వంశీకుల నుంచే తీసుకు రావాలని పెద్దమ్మ కోరిందట. ఆ ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రతి దేవరకు నెల రోజుల ముందు తొలి ముడుపు మా ఇంటి నుంచే తీసుకువెళ్తున్నాం. అందుకు మమ్మల్ని పాలిపేర రెడ్డి అని పిలుస్తున్నారు. అమ్మవారికి తొలి సేవ చేసే భాగ్యం మాకు కలగడం అదృష్టవంతులుగా భావిస్తున్నాం.

– పాలిమేర రెడ్డి కర్నాటి కృష్ణారెడ్డి, డబ్ల్యూ గోవిందిన్నె

ఏర్పాట్లు పూర్తి చేశాం



దాదాపు 11 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న దేవరకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. భక్తులకు దర్శనానికి, మొక్కులు తీర్చుకోవడానికి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నాం. లక్షల సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేశాం.

– తలారి శీను, ఆలయ కమిటీ సభ్యుడు

నీటి కుంటలో పడి బాలిక మృతి



మృతి చెందిన రూప (ఫైల్)

చిప్పగిరి: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఓ బాలిక మృతి చెందిన సంఘటన దౌల్తాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాలు, శకుంతలమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురు రూప (10) ఉదయం పొట్టేలును మేపేందుకు గ్రామ సమీప పొలంలోకి వెళ్లింది. అక్కడ ఉన్న నీటి కుంటలో ప్రమాదవశాత్తూ జారి పడింది. అయితే పక్కనే ఉన్న తోట యజమాని దేవేంద్ర కుమారుడు బాలుడు నితిన్ గమనించి పరుగున వచ్చి కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు వెళ్లి చూడగా అప్పటికే రూప నీటిలో విగత జీవిగా కనిపించడంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కొద్ది రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం అయితే ఆరవ తరగతిలో చేరాల్సిన బాలిక అనంతలోకాలకు చేరడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

అమ్మను చూసి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన షాకీర్(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పండగ రోజు అమ్మను పలుకరించి తిరుగు ప్రయాణమైన కుమారుడు మార్గమధ్యలో మృత్యుఒడి చేరాడు. ఆదోని – కర్నూలు రహదారిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆదోని పట్టణంలోని కొడల్ పేటకు చెందిన అల్లాబకాష్, ఖాజాబానుల కుమారుడు షాకీర్(45)కు ఎమ్మిగనూరు పట్టణం ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఉసేన్‌బీతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సెంట్రింగ్ పనులు చేసే షాకీర్ కొన్నేళ్ల క్రితం ఉపాధి కోసం కుటుంబంతో ఎమ్మిగనూరు చేరుకున్నాడు. అయితే అతని తల్లి ఖాజాబాను ఆదోనిలో ఉండటంతో అప్పుడప్పుడు వెళ్లి పలుకరించి వచ్చేవాడు. ఈ క్రమంలో శనివారం బక్రీద్ సందర్భంగా ఆదోనికి చేరుకున్నాడు. అక్కడే తల్లి, బంధువులతో పండగ జరుపుకుని శనివారం ఎమ్మిగనూరుకు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో బనవాసి ఫారం సమీపంలో స్కార్పియో వాహనం ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన షాకీర్‌ను ఎమ్మిగనూరు ఏరియా హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆసుపత్రిలో మృతుడి భార్య, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

పండగ పూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
- మరో యువకుడికి తీవ్ర గాయాలు





మృతి చెందిన సనావుల్లా (ఫైల్), సమీర్ (ఫైల్)

ఆత్మకూరురూరల్: బక్రీద్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకుంటున్న రెండు కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం విషాదం నింపింది. ఆత్మకూరు మండలం నల్లకాల్వ సమీపంలోని వైఎస్సార్ స్మృతి వనం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. వెలుగోడు పట్టణానికి చెందిన సనావుల్లా(19), సమీర్(20), షేక్షావలి మిత్రులు. వీరు బక్రీద్ పర్వదినం సందర్భంగా స్మృతివనం సందర్శనకు బైక్‌లో వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఆ దారి వెంట వెళుతున్న కొందరు గాయపడిన వారిని వెలుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సనావుల్లా, సమీర్‌లు మృతి చెందారు. గాయపడిన షేక్షావలికి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ నిలుపకుండా పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఆత్మకూరు సీఐ రాము, ఎస్‌ఐ నారాయణరెడ్డి వెలుగోడు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంట్రాక్టర్ల కోసమే గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు

- రూ.81వేల కోట్లు పెడితే రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోవడం ఖాయం
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరరెడ్డి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు(సెంట్రల్): కాంట్రాక్టర్ల లబ్ధి కోసమే గోదావరి – బనకచెర్ల ప్రాజెక్టును చేపడుతున్నారని, దీనివల్ల వెనుకబడిన రాయలసీమలో ఎలాంటి నీటి కష్టాలు తీరవని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి విమర్శించారు. శనివారం కర్నూలులోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు రూ.81 వేల కోట్ల ఖర్చుతో గోదావరి–బనకచెర్ల ప్రాజెక్టును నిర్మించి మూడు లక్షల ఎకరాలకుతోడు కొత్తగా మరో 20 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తామని గొప్పలు చెబుతున్నారని, ఈ ప్రాజెక్టు వల్ల వెనుకబడిన రాయలసీమకు ఎలాంటి ప్రయోజనమూ ఉండదని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ల కోసమే దీనిని నిర్మించ తలపెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే ఉన్న రిజర్వాయర్లకు నిధులు కేటాయిస్తే ఉపయోగం ఉంటుందన్నారు. 2018లో సీఎంగా ఉన్న సమయంలో వేదవతి ప్రాజెక్టును రూ.2 వేల కోట్లతో నిర్మిస్తామని భూమి పూజ చేసి చంద్రబాబు వదలివేశారని గుర్తుచేశారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటన ప్రకారం రూ.4 వేల కోట్లు ఖర్చు పెడితే వెలిగొండ పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో కరువుపీడిత 4 లక్షల ఎకరాలు, 100 గ్రామాలకు తాగునీరు వచ్చే అవకాశం ఉందన్నారు. పల్నాడు జిల్లాలోని వరికెపూడిసెల ఎత్తిపోతల పథకానికి రూ.1300 కోట్లు ఖర్చుపెడితే లక్ష ఎకరాలక సాగునీరు, 100 గ్రామాలకు తాగునీరు ఇవ్వచ్చని పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్ట్‌లను ప్రభుత్వం పట్టించుకోకుండా రూ.81 వేల కోట్లతో గోదావరి–బనకచర్ల చేపడితే కాంట్రాక్టర్లకు లాభం, రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోవడం తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీ రైతు సంఘంజిల్లా కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

డీఆర్‌డీఏలో 65 మంది బదిలీ

- 12 మంది సీసీలు, 53 మంది సీసీలకు స్థానచలనం
- ఉత్తర్వులు జారీ చేసిన పీడీ రమణారెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లో బదిలీల ప్రక్రియను పూర్తయింది. ఏపీఎంలు, సీసీలు కోరుకున్న చోటుకు బదిలీ చేయించుకునేందుకు కూటమి పార్టీల నేతల నుంచి పెద్ద ఎత్తున సిఫారసులు చేయించినట్లు తెలుస్తోంది. అయితే పారదర్శకంగా కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టి బదిలీలు చేసినట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రమణారెడ్డి తెలిపారు. 12 మంది ఏపీఎంలు, 53 మంది కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లు (ఎల్1, ఎల్2, ఎంఎస్‌సీసీ) మొత్తంగా 65 మంది బదిలీ అయ్యారు. స్వయం సహాయక సంఘాల అభ్యున్నతిలో ఏపీఎంల పాత్ర ఎక్కువగా ఉంటుంది. ఈ నెల 9వ తేదీ వరకు అవకాశం ఉన్నప్పటికీ రెండు రోజులు ముందుగానే బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీఎంల బదిలీలు ఇలా ఉన్నాయి...

పేరు	బదిలీ స్థానం
ఎల్.ప్రభావతి	ఓర్వకల్
కే.నాగార్జున	హాలహర్వి
ఆర్.వెంకటరామిరెడ్డి	దేవనకొండ
మాదాల శివయ్య	చిప్పగిరి
జీవీ కృష్ణమూర్తి	ప్యాపిలి
యామిని కాశీశ్వరుడు	ఆత్మకూరు
కే.జయేశ్వరమ్మ	వెలుగోడు
ఏ.జ్యోతి	గడివేముల
డి.తిరుపాల్‌రెడ్డి	గోస్పాడు
సుధాకర్	డీఆర్‌డీఏ కార్యాలయం
ఎంబీ వెంకటస్వామి	కౌతాళం
హుస్సేన్ ఉస్మాన్	బనగానపల్లె

ట్రాక్టర్ శుభ్రం చేస్తుండగా..



మృతి చెందిన చంద్ర (ఫైల్)

రుద్రవరం: ఆలమూరు గ్రామంలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన శేఖర్, విజయలక్ష్మి దంపతుల కుమారుడు చంద్ర(22) అప్పుడప్పుడు తమ సొంత ట్రాక్టర్‌తో సేద్యపు పనులకు వెళ్లేవాడు. ఇందులో భాగంగానే శనివారం పొలానికి వెళ్లేందుకు ట్రాక్టర్‌ను శుభ్రం చేస్తుండగా అకస్మాత్తుగా ట్రాక్టర్ ముందుకు కదలింది. ఆపేందుకు యత్నించిన చంద్ర ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైర్ల కింద పడ్డాడు. అతనిపై చక్రాలు వెళ్లడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

తహసీల్దార్ల బదిలీలు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేశారు. ఒకే చోట కొన్నేళ్లుగా పని చేస్తున్న వారు వేర్వేరు ప్రదేశాలకు బదిలీ అయ్యారు. రాజకీయ పైరవీలతో బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది. జిల్లాలో 8 మంది తహసీల్దార్లు, మరో 8 మంది డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. నంద్యాల ఆర్‌డీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న హసీనాబీని (టీజీపీ) స్పెషల్ తహసీల్దార్ లొకాలీజేషన్ యూనిట్‌కు బదిలీ చేయగా నంద్యాల అర్బన్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రియదర్శినిని నంద్యాల కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు.

తహసీల్దార్ల బదిలీల వివరాలు ఇలా..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఆల్‌ఫ్రెడ్	బండిఆత్మకూరు	కేఆర్‌ఆర్‌సీ కలెక్టర్ ఆఫీసు నంద్యాల
సువర్ణదేవి	అవుకు	ఉయ్యాలవాడ
పద్మావతమ్మ	మహానంది	బండిఆత్మకూరు
ప్రియదర్శిని	నంద్యాల(అర్బన్)	కలెక్టర్ ఆఫీసు, నంద్యాల
రవికుమార్	చాగలమర్రి	డోన్
నాగమణి	డోన్	శిరివెళ్ల
పుష్పకుమారి	శిరివెళ్ల	అవుకు
శ్రీనివాసులు	ఉయ్యాలవాడ	కొలిమిగుండ్ల
హసీనాబీ	ఆర్‌డీఓ ఆఫీసు	స్పెషల్ తహసీల్దార్, టీజీపీ

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీల వివరాలు ఇలా..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వీర నారాయణమ్మ	నందికొట్కూరు	డోన్, ఎంఎల్ఎస్ పాయింట్
కిశోర్‌కుమార్	నందికొట్కూరు సీఎస్‌డీటీ	ఆత్మకూరు ఆర్‌డీఓ కార్యాలయం
రవికుమార్	డోన్ ఆర్‌డీఓ కార్యాలయం	ప్యాపిలి
చంద్రశేఖర్	డోన్	నందికొట్కూరు, ఎంఎల్‌ఎస్‌పాయింట్
షనవాజ్	ఆత్మకూరు ఆర్‌డీఓ కార్యాలయం	నందికొట్కూరు సీఎస్‌డీటీ
మధుసూదనరావు	ప్యాపిలి	డోన్ ఆర్‌డీఓ కార్యాలయం

చెట్టంత ప్రేమ



పెరవలిలో జమ్మిచెట్టును కొట్టివేయకుండా ఇంటిని నిర్మించిన దృశ్యం



మద్దికెరలో ఫ్రెండ్స్ విద్యానికేతన్ పాఠశాల వద్ద..

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షిస్తే.. తర తరాల పాటు మనల్ని రక్షిస్తాయని చెబుతుంటారు. ఇందులో భాగంగా కొందరు ఏపుగా పెరిగిన చెట్లను కొట్టి వేయకుండా నిర్మాణాలను చేపట్టారు. ప్రస్తుతం ఆ నిర్మాణాలకు ఆ చెట్లే అలంకార ప్రాయంగా మారాయి. మండలంలో కొందరు పర్యావరణ ప్రేమికులు చెట్లను కొట్టివేయకుండా వాటిని సంరక్షిస్తూ నిర్మాణం చేపట్టి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. – మద్దికెర



మద్దికెరలో చెట్లను తొలగించకుండా పంచాయతీ కార్యాలయం కాంప్లెక్స్ నిర్మాణం

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ కర్నూలు – ప్రకాష్‌నగర్‌లో U-Con Charry Apartment నందు ఫ్లాట్ నెం. 1, 2BHK గల ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్రదించండి: 98666 45393 [SCA25004157]

PLOT FOR SALE

■ కర్నూలు–నంద్యాల రోడ్డులో పూడిచర్ల సర్కిల్ నూతన వెంచర్‌లో 40x33 సైజు గల ఓపెన్ ప్లాట్లు కలవు. వివరాలకు సంప్రదించండి: 93938 20555. [SCA25004706]

■ నార్త్ పేస్ ప్లాట్స్ 44FTX80Ft and 22ftX40Ft మంచి లోకేషన్ 1Km NH7 & 1.5KM బళ్ళారి చౌరస్తా, విష్ణు టౌన్ షిప్ ముందు సెల్ : 9492702333 [SCA-25004680]

■ KUDA అప్రూవ్ సల్కాపురము వద్ద బళ్లారి మెయిన్ రోడ్డుకి 8.5సెంట్ల ప్లాట్ మరియు తూర్పు,పడమర రోడ్ గల 15 సెంట్ల ప్లాట్ అమ్మబడును. ఫోన్: 8977209682 [HA-15916]

■ నెలకి రూ.20,000 చొప్పున 60 నెలలు చెల్లించి బళ్లారి రోడ్‌కి సమీపంలో మార్కపురము రోడ్‌లో 3సెంట్ల ప్లాట్‌ను పొందండి. షరతులు వర్తిస్తాయి. ఫోన్: 7815865813 [HA-15920]

■ నెలకి రూ.10,000 చొప్పున 60 నెలలు చెల్లించి ఓర్వకల్లు శకునాల దగ్గర సొలార్ ప్లాంట్‌కి సమీపములో 2 సెంట్ల ప్లాట్‌ను పొందండి. షరతులు వర్తిస్తాయి. ఫోన్: 7416216514 [HA-15921]

■ నెలకి రూ.25,000 చొప్పున 60 నెలలు చెల్లించి బెంగుళూరు హైవేకి దగ్గరలో పంచలింగాల దగ్గర 2.75 సెంట్ల ప్లాట్‌ను పొందండి. షరతులు వర్తిస్తాయి. ఫోన్: 7337056771 [HA-15922]

LAND FOR SALE

■ కర్నూలు ఎస్.ఆర్.పేట 2nd లైన్‌లో సత్యసాయి ENT హాస్పిటల్ పక్కన గల 5 సెంట్ల north facing స్థలం అమ్మకమునకు కలదు. వివరాలకు సంప్రదించండి: 94944 82654. [SCA25004666]

■ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ దగ్గర రాధాకృష్ణ నగర్‌లో సర్వే నెం: 148, ప్లాట్ నెంబర్: 214, ఉత్తరం ఫేస్ 4 సెంట్లు ప్లాటు అమ్మకమునకు కలదు. వివరాలకు సంప్ర: 98661 60588. [SCA25004726]

■ కర్నూలు–నంద్యాల రోడ్డు, హుసేనాపురం, పంచాయతీ పరిధిలో హైవేకు, స్టీల్ ప్లాంటుకు దగ్గరలో సర్వే నెం: 425, 6.06 ఎకరాల భూమి, వెంచర్లకు అనుకూలమైన భూమి అమ్మబడును. డైరెక్ట్ ఓనర్: 63002 65849. [SCA25004423]

TO - LET

■ కర్నూలులోని తాండ్రపాడు హైవేకు ఆనుకొని 4000 Sft గల రెండు ఫ్లోర్లు బిల్డింగ్ అద్దెకు కలదు. సెల్ : 9849493305, 6300644328. [SCA25004318]

■ Shops/ Godowns : 3.Shops linked, 40 Feet road access. Sri Lakshmi Commercial Complex, Opp: 4th town P.S, Bellary Chowrastha, Kurnool. Cell: 94410 40844. [SCA25004207]

SERVICES

HEALTH CARE

■ డాక్టర్ IVN వైభవ్‌రెడ్డి, MBBS, M.D.DVL చర్మ వ్యాధి, సుఖ వ్యాధి, కుష్ఠు వ్యాధి నిపుణులు, 6PM-9PM. CN హాస్పిటల్, బిర్లా గేట్ దగ్గర, బి.క్యాంప్, కర్నూలు. సంప్ర: 9642610452, 08518-230377. [SCA25004356]

UNANI

■ దీర్ఘకాలిక క్యాన్సర్, కిడ్నీ స్టోన్స్, గుండెలో నొప్పి, మంట మరియు పక్షవాతము వ్యాధులకు యునాని మందుల ద్వారా చికిత్స చేయబడును. Md. షఫీ హకీమ్, కర్నూలు. 9397011918. [SCA25003557]

GYNECOLOGY

■ డా॥ కె.అరవింద MBBS, DNB, OBG గర్భిణీ మరియు స్త్రీ వ్యాధి నిపుణురాలు. 2PM To 5PM & 5 PM-9PM. శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు. ✆ 88970 87874 [SCA25004714]

PHYSICIAN

■ డా॥కె.చంద్రమౌళీ రెడ్డి, Gen. MED, IDCCM, జనరల్ & ఫిజీషియన్, ఫెలో ఇన్ క్రిటికల్ కేర్ యూనిట్, ప్రతి గురువారం షుగర్ ఫ్రీ చెకప్. శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు. సెల్: 88970 87874. [SCA25004712]

FOR SALE

■ మా వద్ద అన్ని రకముల స్కూల్ డ్రస్సులు లభించును. స్వాతి సిల్క్ హౌస్, నెహ్రూ రోడ్డు, ఎ.కె.మార్కెట్ ఎదురుగా, కర్నూలు. వివరాలకు సంప్రదించండి: సెల్: 9849846562, 8121862725. [SCA25004417]

BUSINESS OFFER

■ We Purchase Old & Damage Carton Boxes Scrap For Rs 13 Or 14 +GST, Contact +917093092288 [DA-8848]

MARRIAGE SERVICES

వధువు కావలెను

■ దూదేకుల: 45/5.8/స్వంత బిజినెస్, నెలకు: 30వేలు, 30లక్షలు ప్రాపర్టీ గల వరునికి 30 నుండి 40 సం॥లు వయస్సు గల వధువు కావలెను. డైరెక్ట్: ✆ 99636 27718. [SCA25004125]

WANTED

■ నంద్యాల జిల్లా బనగానపల్లెలోని నెహ్రూ హై స్కూల్ నందు పనిచేయుటకు అన్ని సబ్జెక్టులకు ట్యూటర్లు కావలెను. వివరాలకు సంప్రదించండి: 9550131444, 6302026495, 9441056875. [SCA25004628]

■ రాయలసీమ స్కూల్ కర్నూలు నందు నర్సరీ to 8th క్లాస్ వరకు అన్ని సబ్జెక్టులు అండ్ కంప్యూటర్ లేడీస్ టీచర్లు కావలెను. వివరాలకు సంప్రదించండి: ✆ 9949804648, 9398252467. [SCA25004245]

■ ప్రముఖ స్టీల్ కంపెనీలో మార్కెటింగ్ విధులు నిర్వహించుటకు (Male / Female) అభ్యర్థులు కావలెను. టూవీలర్ ఉన్నవారికి ప్రాధాన్యత. సెల్ : 8121213311, 9010559955. steelbuddy144@gmail.com [SCA25004400]

■ Wanted బృందావన్ ఇంజినీరింగ్ కాలేజి, పెద్దటేకూరు, కర్నూలు (డోన్ రోడ్) వారికి బాలుర & బాలికల హాస్టల్స్ కొరకు ఫుల్ టైం వార్డెన్లు (వయస్సు 35 సం॥ పైబడిన), వాచ్‌మెన్స్ కావలెను. వివరాలకు సంప్రదించండి: 81422 33352. [SCA25004690]

■ Wanted room service boys for prime land hotel (8k) Males only. Contact: kurnool. cell: 9014867947, 08518-220345. [L-019]

■ Wanted Botany, Zoology, Physics, Chemistry and 2 Male Wardens for Jr.College, Knl- Contact : 8500780180. [SCA25004654]

■ Wanted wardens (M/F) for boys & girls college hostel. Sweepers, attenders, Qly: Degree. contact: ✆ 9701478481, 8897625252. [SCA25004724]

■ WANTED EM TEACHERS for Nur to Ukg, I to IV Eng, Evs, Maths, VI to X Ps. Adithya School, Kallur. Cell: 94901 30596. [L-638]

■ Wanted Teachers (Nursery to 10th class) Cont : Vijetha High School, Near Krishnanagar , ITC, Kurnool. Send your resume via WhatsApp to : 94921 98651. [SCA25004471]

■ Indus TOWERS, CARE TAKER PVT LTD, MADHAPUR, HYD. Boys 20-35 years total 997 posts, care taker 17,016/-, superviser 23,594/- ✆ : 70752 67766. [SCA25004611]

■ Wanted Preprimary, Primary Teachers to teach all subjects & lady PET. So Applicants have to consult the head mistress with your xerox certificates from 8:30am to 11:00am on monday. Sri Meghana High School, Near A.P.Tourism, knl. 9491856769. [SCA25004647]

■ తిరుమల, తిరుపతి నందు కాంట్రాక్ట్ పద్ధతిలో సూపర్‌వైజర్లు, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్లు అర్జెంట్‌గా కావలెను. 9848599889, 9121903906. [T-2467]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 300/-
అదనపు లైనుకు రూ. : 75/-
క్లాసిఫైడ్ డిస్‌ప్లే (Sq.Cm) : 215/-
(Width: 3.7 Cms, Height Minimum 3 Cms.)
5% GST అదనం

మరిన్ని వివరాలకు సంప్రదించండి
70750 09165
70750 09185